క్లుప్తంగా

కామాక్షితాయి సేవలో..



అతిథులకు ప్రసాదాలు అందజేస్తున్న ఈఓ గిరికృష్ణ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారిని రాష్ట్ర సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ జితేంద్రనాథ్‌శర్మ, సీనియర్ ఆడిట్ ఆఫీసర్ శ్రీధర్ శనివారం దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఈఓ గిరికృష్ణ అతిథులకు ఆలయమర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

సిమెంట్ బెంచీల వితరణ



మనుబోలు : మండల కేంద్రంలోని పలు కూడళ్లలో శ్రీసేవానాథం ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం సిమెంట్ బెంచీలను వితరణ చేశారు. గతంలో రెండు విడతల్లో ప్రధాన కూడళ్ల, పాఠశాలలు, దేవాలయాల ఆవరణలో సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. వేసవి నేపథ్యంలో మూడో విడతలో పాదచారులు సేద తీరేందుకు గ్రామంలోని పలుచోట్ల బెంచీలను ఏర్పాటు చేసినట్లు ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు.


మూల్యాంకనానికి అధ్యాపకులను పంపాలి



మాట్లాడుతున్న ఆర్ఐఓ శ్రీనివాసులు

నెల్లూరు (టౌన్): ఇంటర్మీడియట్ జవాబు పత్రాల మూల్యాంకనానికి బోర్డు నియమించిన అధ్యాపకులను రిలీవ్ చేసి పంపాలని ఆర్ఐఓ శ్రీనివాసులు ఆయా జూనియర్ కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాల్స్‌ను ఆదేశించారు. నగరంలోని కేఏసీ జూనియర్ కళాశాలలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐఓ మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి కేఏసీ జూనియర్ కళాశాలలో మూల్యాంకనం ప్రారంభమవుతుందన్నారు. ఈ నెల 21 వరకు ఇంగ్లిష్, తెలుగు, హిందీ, మ్యాథమెటిక్స్, సివిక్స్, 25 వరకు ఫిజిక్స్, ఎకనామిక్స్, 28 వరకు బొటని, జువాలజీ, కామర్స్ సబ్జెక్ట్‌లకు సంబంధించిన మూల్యాంకనం జరుగుతుందన్నారు. అధ్యాపకులను పంపని ప్రిన్సిపాల్స్‌కు రోజుకు రూ.1000 వంతున అపరాధ రుసుం విధిస్తామన్నారు. అవసరమైతే కళాశాలల అనుమతుల రద్దుకు సిఫార్సు చేస్తామన్నారు. బోర్డు నిబంధనలకు విరుద్ధంగా వేసవిలో అడ్మిషన్లు, తరగతులు, వసతిగృహాలు నిర్వహించకూడదన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంటర్‌బోర్డు పరిశీలకులు బహుగుణ మాట్లాడుతూ స్పాట్ కేంద్రాల్లో స్కానింగ్ ఏర్పాటు చేసి మూల్యాంకనాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం శ్రీపొట్టిశ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో డీవీఈఓ మధుబాబు, ఆయా కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

పది పరీక్ష కేంద్రాలకు నిరంతర విద్యుత్ సరఫరా



నెల్లూరు(వీఆర్సీసెంటర్): పదోతరగతి పరీక్ష కేంద్రాలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఏపీఎస్పీడీసీఎస్ జిల్లా ఎస్‌ఈ విజయన్ విద్యుత్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన నగరంలోని విద్యుత్ భవన్ నుంచి విద్యుత్ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున జిల్లాలోని అన్ని పోలింగ్ బూత్‌లలో విద్యుత్ సరఫరా ఉండాలని, ఎలాంటి అంతరాయం కలిగిన సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వేసవిలో విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని అందుకు తగినట్లుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. డీ లిస్టుపై సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టి నిర్ణీత గడువులోగా పూర్తిచేసి రెవెన్యూ కార్యాలయాలకు పంపాలన్నారు.విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన వారిపై శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, టెక్నికల్ ఈఈ శేషాద్రి బాలచంద్ర పాల్గొన్నారు.

అమరజీవికి ఘన నివాళి

• ఘనంగా పొట్టిశ్రీరాములు జయంతి

వెంకటాచలం : మండలంలోని కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టిశ్రీరాములు చిత్రపటానికి వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటులో పొట్టిశ్రీరాములు కృషి మరువలేనిదని కొనియాడారు. రాష్ట్రం ఉన్నంత కాలం అమరజీవిని ప్రజలు మర్చిపోరని తెలియజేశారు. ఆయన ప్రాణత్యాగం ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు పునాదిగా మారిందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ విజయానంద్‌కుమార్ బాబు, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, డాక్టర్ హుస్సేనయ్య, వెంకట్రాయులు, బీవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వెంకటాచలం : పొట్టిశ్రీరాములు జయంతి వేడుకల్లో రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డి, అధ్యాపకులు

బస్టాండ్ సెంటర్‌లో..

పొదలకూరు : అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలను పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఆయన విగ్రహం వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నేత ఆదూరు వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ పొట్టిశ్రీరాములు త్యాగ ఫలితం వల్లనే ఆంధ్ర రాష్ట్రం సాధ్యమైందన్నారు. దళితుల ఆలయ ప్రవేశానికి ఉద్యమం నడిపినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో నాయకులు ఆకులూరు హేమంత్‌కుమార్, తన్నీరు వీరప్రకాశం, దామిశెట్టి శ్రీనివాసులు, అమరా భగవాన్, రాచపూటి ధనుంజయరావు, చాట్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

• నెల్లూరు రూరల్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎ.చెంచయ్య, పొట్టి సుధాకర్, బ్రహ్మయ్య, మీరామధు, తన్నీరు సురేష్, కామేశ్వరరావు, సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

మహనీయులు అమరజీవి

విడవలూరు: ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహనీయులు అమరజీవి పొట్టిశ్రీరాములు అని ప్రిన్సిపల్ బి.సుజాత అన్నారు. స్థానిక పీఆర్‌ఆర్–వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పొట్టిశ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.మధు, అధ్యాపకుడు ఎమ్.వెంకటరమణరావు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శప్రాయులు

ఇందుకూరుపేట : ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు పొట్టిశ్రీరాములు ఆదర్శప్రాయులు అని పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమ కో–కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి అన్నారు. మండలంలోని పల్లిపాడులో ఉన్న గాంధీ ఆశ్రమంలో పొట్టిశ్రీరాములు జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్ముని బాటలో పొట్టిశ్రీరాములు పయనించి ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించారన్నారు. తొలుత పొట్టిశ్రీరాములు చిత్రపటానికి, ఆశ్రమంలోని గాంధీ, స్థలదాత పొణకా కనకమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆశ్రమ కోర్‌కమిటీ సభ్యుడు గంపల మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు.



పొదలకూరు : పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నేతలు



విడవలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..



ఇందుకూరుపేట : పల్లిపాడు గాంధీ ఆశ్రమంలో..

వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించండి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మరోసారి ఆశీర్వదించాలని బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని మూడో వార్డు ఇస్కపాళెంలో ఆమె శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేకూరిన లబ్ధి గురించి ప్రజలకు వివరించారు. అనంతరం మాట్లాడుతూ కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, నెల్లూరు ఎంపీగా పోటీ చేస్తున్న వేణుంబాక విజయసాయిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు. సంక్షేమ పథకాల అమలు జరగాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు కోడూరు మధుసూదన్‌రెడ్డి, విల్సన్, కౌన్సిలర్ ప్రవల్లిక, మోర్ల మురళి, ఆదిశేషయ్య తదితరులు పాల్గొన్నారు.



ఇస్కపాళెంలో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న చైర్‌పర్సన్ సుప్రజ

చోరీలపై అప్రమత్తంగా ఉండాలి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బుచ్చిరెడ్డిపాళెం సీఐ హైమారావు అన్నారు. పట్టణంలోని ఆయన కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇటీవల కాలంలో మండలంలోని పలు గ్రామాల్లో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. దామరమడుగు, బుచ్చిరెడ్డిపాళెం, సాల్మన్‌పురంలో ఈ మధ్యకాలంలో దొంగతనాలు జరిగాయని వివరించారు. ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. నగలు, నగదు ఎక్కువగా ఇంట్లో ఉంచకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. ఊర్లకు వెళ్లే సమయంలో తమకు సమాచారం అందిస్తే ఎల్‌హెచ్‌ఎంఎస్(లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం)ద్వారా నిఘా ఉంచుతామన్నారు. తద్వారా దొంగతనాలు తగ్గుతుందని తెలిపారు. ఇంటి ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిపై తమకు సమాచారం అందించాలని కోరారు.



మాట్లాడుతున్న సీఐ హైమారావు

పుంజులూరుపాడులో పశు వైద్యశిబిరం

వెంకటాచలం : మండలంలోని పుంజులూరుపాడు గ్రామంలో మండవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్యశిబిరాన్ని శనివారం నిర్వహించారు. వైద్యుడు శ్రీనివాసులు నాయుడు గేదెలు, దూడలను పరీక్షించి అవసరమైన గేదెలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గేదెలు రోగాల బారిన పడి చనిపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండవ ఫౌండేషన్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



గేదెలను పరీక్షిస్తున్న వైద్యుడు

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రతిభ

కొడవలూరు: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరు నగరంలో ఈనెల 13, 14, 15వ తేదీల్లో నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో నార్తురాజుపాళెం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.నాగభూషణమ్మ నాలుగు బహుమతులు గెలుపొందారు. రింగ్‌బాల్, క్యాట్‌వాక్‌లో మొదటి బహుమతి, అంత్యాక్షరి, డ్యూయట్ సాంగ్‌లలో ద్వితీయ బహుమతులు గెలుచుకున్నారు. దీంతో ఆమెకు శుక్రవారం రాత్రి డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నాగభూషణమ్మను కోవూరు సీడీపీఓ జ్యోతి, సూపర్‌వైజర్‌లు వి.పద్మావతి, ఎస్.నిర్మల అభినందించారు.



బహుమతి అందుకుంటున్న సూపర్‌వైజర్ నాగభూషణమ్మ

సినీతార సందడి

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో సినీతార అనన్య నాగళ్ల శనివారం సందడి చేశారు. 'తంత్ర' సినిమా విజయోత్సవ సభ సందర్భంగా ఆమె విద్యార్థులతో ముచ్చటించారు. మంచి చిత్రాలను ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారని అభిప్రాయపడ్డారు. తొలుత తంత్ర సినిమా ట్రైలర్ ప్రదర్శించడంతో విద్యార్థులు కేరింతలు కొట్టారు. చివరిగా కళాశాల చైర్మన్ పి.గుణశేఖర్ హీరోయిన్‌ను జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అనిల్ కుమార్, సహ నటులు పాల్గొన్నారు.



బంగారు గొలుసు దోపిడీ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని రామకృష్ణానగర్‌కు చెందిన కొండమ్మ అనే మహిళ స్థానికంగా ఉన్న ఓ షాప్‌లో కూల్‌డ్రింక్ తాగి నడిచివెళ్తున్న సమయంలో ఆమె మెడలోని మూడు సవర్ల బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి లాక్కెళ్లిన ఘటన శనివారం చోటు చేసుకుంది. బంగారు గొలుసు విలువ రూ.1.70 లక్షలు ఉంటుందని బాధితురాలు తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ హైమారావు తెలిపారు.

కల్లుగీత కార్మికునికి ఆర్థిక సాయం



ఇందుకూరుపేట: మండలంలోని లేబూరుకు చెందిన కల్లుగీత కార్మికుడు పి.వెంకటేష్‌కు జిల్లా గౌడ, కల్లుగీత పారిశ్రామికుల సంఘం ఆధ్వర్యంలో రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఆయన కల్లుగీస్తూ ప్రమాదవశాత్తు చెట్టుమీద నుంచి పడి గాయాలపాలయ్యారు. దీంతో గౌడ సేవాసమితి ట్రస్ట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోసూరి రాజశేఖర్‌గౌడ్, అధ్యక్షుడు తోట ప్రభాకర్ శనివారం లేబూరుకు వెళ్లి నగదును అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు తాతా రమణయ్య, ఉప్పాల రామకృష్ణయ్య, కుడుమల అశోక్‌రావు, కోసూరు చినగోవిందు, వేణుగోపాల్‌గౌడ్ పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామికి పూజలు



ప్రత్యేకాలంకరణలో స్వామి

పొదలకూరు : పట్టణంలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో మాఘ మాసం సందర్భంగా స్వామి, అమ్మవార్ల పల్లకిసేవ శనివారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకాలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ప్రసాదాలు అందజేశారు.

కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

మనుబోలు : ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ ప్రసాద్ హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఫ్లెక్సీలు, పోస్టర్‌లను తొలగించాలని సిబ్బందిని శనివారం ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచి ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు నియమావళి అమలులో ఉంటుందన్నారు. పార్టీలకు సంబంధించిన నాయకుల విగ్రహాలు ఉంటే ముసుగులు వేస్తామన్నారు. వివిధ పార్టీలకు చెందిన నాయకుల బొమ్మలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు బహిరంగ ప్రదేశాల్లో ఉంటే తొలగించాలని సిబ్బందికి సూచించారు. అలాగే శిలాఫలకాలు కనిపించకుండా అడ్డుగా పేపర్ అంటిస్తామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా పాటించాలని సూచించారు.



శిలాఫలకాలకు అడ్డుగా పేపర్ అంటిస్తున్న సిబ్బంది

వెంకయ్యస్వామి సేవలో మంత్రి కాకాణి

వెంకటాచలం : గొలగమూడిలోని భగవాన్ శ్రీవెంకయ్యస్వామి ఆశ్రమాన్ని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం సందర్శించారు. తొలుత ఆశ్రమ ఎగ్జిక్యూటివ్ అధికారి పి.బాలసుబ్రహ్మణ్యం మంత్రికి ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేశారు. మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ కోడూరు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, పార్టీ మండల కన్వీనర్ కొణిదెన మోహన్ నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు నంబూరు రాజానాయుడు, కొణిదెన విజయభాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న మంత్రి కాకాణి

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

కొడవలూరు: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సూచించారు. పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా మండలంలోని గండవరం –2 అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ టి.నాగభూషణమ్మ, గుండాలమ్మపాళెంలో సూపర్‌వైజర్ ఎస్.నిర్మల ఆధ్వర్యంలో తల్లులు, గర్భిణులకు పోషక విలువలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోషకాహారం లోపిస్తే రక్తహీనతకు దారి తీసి ప్రమాదకర పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుందని, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, పిల్లలు విధిగా తీసుకోవాలన్నారు. గండవరంలో ఏఎన్ఎం పి.మమత, హెచ్ఏ నాగయ్య, అంగన్‌వాడీలు షంషాద్, పి.ఉమ, ఎం.మమత, యు.రాజేశ్వరి, బి.ప్రియదర్శిని, కె.రాధిక, గుండాలమ్మపాళెంలో అంగన్‌వాడీలు హైమా, మమత, సంపూర్ణ, శ్రావణి, రేణుక పాల్గొన్నారు.



గండవరంలో పోషకాహారంపై అవగాహన

వైఎస్సార్‌సీపీలోకి వలసలు

వెంకటాచలం: మండలంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వలసలు గతకొన్ని రోజుల నుంచి నిరంతరం కొనసాగుతున్నాయి. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్వేపల్లి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరుతున్నారు. తాజాగా కసుమూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మందా రమణయ్య (మెకానిక్ రమణయ్య) వైఎస్సార్‌సీపీలో చేరారు. నెల్లూరు నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రాత్రి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయనకు మంత్రి కాకాణి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, పార్టీ నేతలు చీకుర్తి నరసయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన రమణయ్యతో మంత్రి కాకాణి

గ్రామ సమస్యలను పరిష్కరించారు

మనుబోలు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తమ ప్రాంత సమస్యలను పరిష్కరించారని మండలంలోని జట్లకొండూరు పంచాయతీ జ్యోతినగర్ వాసులు తెలిపారు. ఈ మేరకు వారు జ్యోతినగర్‌లో శనివారం మాట్లాడారు. స్థానికంగా విద్యుత్ పోల్స్ దెబ్బతిని తీగలు కిందకు వేలాడుతుంటే విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి కొత్త పోల్స్ వేయించారని తెలిపారు. ఎంతో కాలంగా సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇప్పించారని, ఆర్టీసీ బస్సు ఇక్కడ ఆగేలా చేశారన్నారు. కాలనీలో సీసీరోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకున్నారన్నారు. ఇన్ని మంచి పనులు చేసిన కాకాణిని మరోసారి గెలిపించుకుంటామని తెలిపారు. వారి వెంట ఉపసర్పంచ్ ఆవుల తులసీరామ్ ఉన్నారు.



మంత్రి కాకాణికి ధన్యవాదాలు తెలుపుతున్న జ్యోతినగర్ వాసులు

పది పరీక్షలకు సిద్ధం

• మూడు కేంద్రాల్లో 707 మంది విద్యార్థులు

ముత్తుకూరు : ఈనెల 18వ తేదీ నుంచి మొదలయ్యే పదో తరగతి పరీక్షలకు సంబంధించి ముత్తుకూరు మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్ల నుంచి 707 మంది విద్యార్థులు మూడు కేంద్రాల ద్వారా పరీక్షలు రాస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. ఇందులో భాగంగా బ్రహ్మదేవి జెడ్పీ హైస్కూల్ నుంచి 36 మంది, ఎంపీపాళెం జెడ్పీ హైస్కూల్ నుంచి 64 మంది, దమ్మాయపాళెం నుంచి 24 మంది, ముత్తుకూరు జెడ్పీ నుంచి 93 మంది, ఈపూరు వెంకనపాళెం నుంచి 46 మంది, కృష్ణపట్నం జెడ్పీ నుంచి 50 మంది పరీక్షలకు సిద్ధమవుతున్నారు. అలాగే, ముత్తుకూరు గురుకుల పాఠశాల నుంచి 79 మంది, పిడతాపోలూరు రత్నం హైస్కూల్ నుంచి 122 మంది, నేలటూరు డీఏవీ స్కూల్ నుంచి 12 మంది, ముత్తుకూరు సీవీఆర్ స్కూల్ నుంచి 56 మంది, వీబీఆర్ స్కూల్ నుంచి 90 మంది. శ్రీచైతన్య నుంచి 35 మంది పరీక్షలకు సిద్ధమవుతున్నారు. వీరంతా ముత్తుకూరు జెడ్పీ హైస్కూల్, గురుకుల పాఠశాల, పిడతాపోలూరు రత్నం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు రాస్తారు.



పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

తాగునీటి సమస్యకు పరిష్కారం

• మొగళ్లూరు ఎస్టీ కాలనీకి ప్రత్యేక పైప్‌లైన్

పొదలకూరు : మండలంలోని మొగళ్లూరు ఎస్టీ కాలనీ వాసులకు ప్రత్యేక పైప్‌లైన్ నిర్మాణం చేపట్టడంతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎస్టీ కాలనీకి వెళ్లిన సందర్భంగా వారు తమకు తాగునీటి సమస్య ఉందని, నీరు సక్రమంగా అందడం లేదని వివరించారు. వెంటనే స్పందించిన మంత్రి కాకాణి చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు. దీంతో సర్పంచ్ ఆకుల లక్ష్మి ద్వారా పనులు చేపట్టి ఎస్టీకాలనీకి కొత్త విద్యుత్ మోటార్, ప్రత్యేక పైప్‌లైన్ నిర్మాణం పూర్తి చేయడంతో తాగునీరు పుష్కలంగా సరఫరా అవుతున్నట్లు తెలిపారు. తమ నీటి సమస్యను పరిష్కరించిన మంత్రికి ఎన్నవేళలా రుణపడి ఉంటామని గిరిజనులు వెల్లడించారు.



గిరిజన కాలనీకు ఏర్పాటు చేసిన ప్రత్యేక పైప్‌లైన్



తాగునీటి స్కీమ్ కోసం బిగిస్తున్న కొత్త మోటారు